సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 14 । జూన్ । 2024



మామిడి కొనుగోళ్లు అంతంతే..

ఈ ఏడాది మహిళా సంఘాల నేతృత్వంలోని ఎఫ్‌పీసీల ద్వారా జిల్లాలో మామిడి కొనుగోళ్లు నామమాత్రంగానే సాగాయి. 8లో



.. ప్రాణం నిలబెట్టండి

రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడే అవకాశమున్నందున అంతా సామాజిక బాధ్యతగా భావించాల్సిన అవసరముంది. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవుతాయి. సాయంత్రం పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

సీతారామ.. ఇక స్పీడప్

సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ఖరీఫ్‌లో సాధ్యమైనంత మేరకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి, ముగ్గురు మంత్రులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- ఆరు గంటల పాటు కలియదిరిగిన మంత్రులు
- అమ్మగారిపల్లి నుంచి పూసుగూడెం వరకు పరిశీలన
- ప్రాజెక్టు పనులపై సమీక్షించిన భట్టి, ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి
- ఆగస్టు 15 నాటికి గోదావరి నీరు పొలాలకు మళ్లించాలని ఆదేశాలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి, తుమ్మల, ఎంపీలు, ఎమ్మెల్యేలు



పంపుహౌస్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి

మంత్రుల పర్యటన ఇలా..

సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మిస్తున్న అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామానికి ఉదయం 11:30 గంటలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేరుకున్నారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆ తర్వాత కాటన్ నిర్మించిన ఆనకట్ట, మధ్యలో ఆగిపోయిన బ్యారేజ్ పనులు, దిగువన హెడ్ రెగ్యులేటరీ పనులను పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గంలో సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ వెంట ప్రయాణిస్తూ బీజీ కొత్తూరులోని మొదటి పంప్‌హౌస్ వద్దకు చేరుకున్నారు. అక్కడ మోటార్లు, నీటిని ఎత్తి పోసే పద్ధతుల గురించి ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన కాల్వ పనులను పరిశీలిస్తూ ములకలపల్లి మండలంలోని వీకే రామవరం – పూసుగూడెం గ్రామాల మధ్య ఉన్న ప్రాజెక్టు రెండో పంప్‌హౌస్‌కు చేరుకున్నారు.

ఈ ఖరీఫ్ సాగుకు నీరందాలి..

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భూములకు సాగునీరు అందేలా పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను మంత్రులు ఆదేశించారు. బీజీ కొత్తూరు, వీకే రామవరం, కమలాపురం వద్ద ఉన్న పంప్‌హౌస్‌ల్లో డ్రై రన్ నిర్వహించాలని ఇంజనీర్లకు సూచించారు. ప్రధాన కాల్వకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. దీంతో పాటు రూ.72 కోట్ల వ్యయంతో 9 కి.మీ. నిడివితో నిర్మిస్తున్న ఏన్కూరు లింక్ కెనాల్ పనులు యుద్ధప్రతిపాదికన చేపట్టి జూలై చివరి నాటికి పూర్తి చేయాలని చెప్పారు. ఈ మేరకు భూసేకరణ, టెండర్ల ప్రక్రియల్లో జాప్యం కాకుండా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 నాటికి ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా నాగార్జునసాగర్ కెనాల్ కింద ఉన్న 1.50 లక్షల ఎకరాలకు గోదావరి నీరు అందించాలని సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కనీసం 60 వేల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేలా ప్రయత్నించాలని మంత్రులు చెప్పారు.

పాలేరు టన్నెల్ పనులు ప్రారంభించాలి..

సీతారామ ప్రాజెక్టు సందర్శన అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో రద్దు చేసిన పాలేరు టన్నెల్ పనులు తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు తిరిగి సిద్ధం చేయాలన్నారు. రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులు రూ.2,554 కోట్లతో పూర్తయ్యేవని, అలాంటి దాన్ని సీతారామ రీ డిజైన్ పేరుతో గత ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లకు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మైనర్, మీడియం, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. సీతారామ ద్వారా కొత్తగూడెం, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలకు నీరందించేలా ప్రయత్నిస్తామని చెప్పారు. సీతారామ సమీక్షకు సంబంధించి ఏర్పాట్లు బాగా లేవని ఇరిగేషన్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ గందరగోళంగా ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 1997 – 98లోనే దుమ్ముగూడెం ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని, వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ తెరపైకి వచ్చాయని తెలిపారు. ఆ సమయంలో మోటార్లు, పైపులు కొనుగోలు చేసినా భూసేకరణ చేయకపోవడంతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రధాన పనులను వదిలేసి, చివరి దశ పనులు ముందుగా పూర్తి చేసిందని, అందుకే భారీగా ఖర్చయినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. వచ్చే జూలై 31 నాటికే సీతారామ ద్వారా గోదావరి నీళ్లు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టుతో జిల్లాకు అన్యాయం జరుగుతోందని, ఇక్కడ ఆయకట్టు చాలా తక్కువగా ఉందని అన్నారు. గోదావరి పక్కనే ఉన్నా పినపాక, భద్రాచలం నియోజకవర్గాలకు చుక్క నీరు అందడం లేదని, అవసరమైతే కొత్త ఎత్తిపోతలు చేపట్టి ఈ నియోజకవర్గాలకు సాగునీరు అందించాలని కోరారు. సమావేశంలో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణతో పాటు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వేదిక దిగిన తుమ్మల

రాజీవ్‌సాగర్ రద్దు, సీతారామ ప్రాజెక్టు రీ డిజైనింగ్‌పై చర్చ మొదలైన కాసేపటికే మంత్రి తుమ్మల వేదిక దిగి కిందకు వచ్చారు. అక్కడున్న వారితో కాసేపు మాట్లాడారు. తిరిగి వేదికను ఎక్కిన తర్వాత సాంకేతిక కారణాల వల్ల గత ప్రభుత్వం రీ డిజైన్ చేసిందని చెప్పడం కొసమెరుపు.

ప్రణాళికాయుతంగా పనులు చేయకపోవడంతోనే..

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి వివిధ ప్యాకేజీల్లో జరుగుతున్న పనులు, వాటి పురోగతి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రయత్నించారు. అయితే ఇప్పటివరకు ఎంత ఖర్చయింది, ఎన్ని ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించారంటూ మంత్రులు ఒక్కొక్కరుగా ప్రశ్నించారు. ఇప్పటి వరకు రూ.8వేల కోట్లు ఖర్చయినా, ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదని ఇంజనీర్లు వివరించారు. ప్రణాళికాయుతంగా పనులు చేపట్టకపోవడం వల్లే భారీగా ఖర్చయినా ఇసుమంత ప్రయోజనం కూడా చేకూరలేదని మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిర్వాసిత రైతులకు న్యాయం చేస్తాం..



కెనాల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, కలెక్టర్ గౌతమ్ తదితరులు

ఏన్కూరు: సీతారామ లింకు కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఏన్కూరులో జరుగుతున్న లింకు కెనాల్ పనులను గురువారం వారు పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా పలువురు రైతులు నోటీసులు ఇవ్వకుండానే పనులు మొదలుపెట్టారని, వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నందున ఎకరాకు రూ.40 లక్షల పరిహారం చెల్లించాలని భీష్మించుకూర్చున్నారు. దీంతో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల వారితో మాట్లాడారు. రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం నుండి సరైన పరిహారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ఎంపీపీ అరెం వరలక్ష్మి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌తో పాటు పోట్ల నాగేశ్వరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బొర్రా రాజశేఖర్, శెట్టిపల్లి వెంకటేశ్వరావు, గుత్త వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడగా ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురంలో 51.5 మి.మీ. ఎన్నెస్పీ గెస్ట్‌హౌజ్ ప్రాంతంలో 45 మి.మీ., ప్రకాశ్‌నగర్‌లో 8.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, కామేపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో సైతం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఇక మధిర మండలంలోని పలు గ్రామాల్లో సైతం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవగా వివిధ ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే, మధిరలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీరు చేరడంతో కొద్దిసేపు రాకపోకలు స్తంభించాయి.

న్యూస్‌రీల్

న్యాయ సేవా సంస్థలో నియామకాలు పూర్తి



అభ్యర్థికి నియామకపత్రం అందిస్తున్న జిల్లా జడ్జి

ఖమ్మంలీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన కొనసాగుతున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలు పూర్తయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ పర్యవేక్షణలో మొదటి అదనపు జిల్లా జడ్జి కె.ఉమాదేవి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కే.వీ.చంద్రశేఖర్‌రావుతో కూడిన కమిటీ అభ్యర్థులకు మూడు రోజులుగా పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈమేరకు ఆఫీస్ క్లర్క్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్యూన్లుగా ఎంపికైన వారికి జిల్లా జడ్జి నియామకపత్రాలు అందజేశారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యాన నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరైన 863మందిలో 349మంది(40.44శాతం), ఇంటర్మీడియట్‌లో 1,031 మందికి 462మంది(44.81శాతం) ఉత్తీర్ణత సాధించారని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. అభ్యర్థులు ఫలితాలను www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే, రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 18నుంచి 27వ తేదీ వరకు వెబ్‌సైట్ లేదా మీ సేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో రీకౌంటింగ్ సబ్జెక్టుకు రూ.400, పదో తరగతికి రూ.350, రీ వెరిఫికేషన్, జవాబుపత్రాల జిరాక్స్ కోసం ఇంటర్మీడియట్, పదో తరగతి అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.1,200 చొప్పున చెల్లించాలని సూచించారు.

పాలేరు నుండి ఖమ్మంకు తాగునీరు



కాల్వ ద్వారా విడుదలవుతున్న నీరు

కూసుమంచి: ఖమ్మం నగర ప్రజల తాగు అవసరాల నిమిత్తం మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుండి గురువారం నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ ఎడమ కాల్వ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, 24 గంటల పాటు విడుదల కొనసాగుతుంది. ఈ నీరు ఖమ్మం మున్నేటికి చేరనుండడంతో ఖమ్మం ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. గతంలోనూ రెండు మార్లు నీటిని విడుదల చేయగా, ఆ జలాలు అడుగంటడడం.. వర్షాలు కురవకపోవడంతో ఇబ్బంది లేకుండా మరోమారు విడుదల చేశారు.

'బడి బాట'లో 2,171మంది చేరిక

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చేపట్టిన బడి బాట కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ఈమేరకు గురువారం కొత్తగా 2,171 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని డీఈఓ సోమశేఖరశర్మ, సీఎంఓ రాజశేఖర్ తెలిపారు. ఇందులో అంగన్‌వాడీల నుంచి 801మంది ప్రైమరీ పాఠశాలల్లోకి, ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల నుంచి అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లలోకి 1,074మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 287మందే కాక బడిబయట నుంచి 9మంది చేరారని వెల్లడించారు. ఇదిలా ఉండగా గురువారం 62,066మంది విద్యార్థులకు 35,805మంది హాజరుకావడంతో 58 శాతంగా నమోదైందని డీఈఓ తెలిపారు.

కారేపల్లి వాసికి లా సెట్‌లో 3వ ర్యాంకు



నరేష్

కారేపల్లి: కారేపల్లి మండలం గేటుకారేపల్లికి చెందిన తాళ్లూరి నరేష్ గురువారం విడుదలైన లాసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించాడు. ఇరిగేషన్ శాఖలో ఏఈగా నేలకొండలపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన గతేడాది సైతం లాసెట్ రాసి రాష్ట్ర రెండో ర్యాంకు దక్కించుకున్నాడు. మళ్లీ ఈసారి పరీక్ష రాసిన ఆయనకు మూడో ర్యాంకు వచ్చింది. అయితే, ఉద్యోగం, కుటుంబ పరిస్థితుల కారణంగా ఆసక్తి ఉన్నా ఎల్‌ఎల్‌బీ చేయడం సాధ్యం కావడం లేదని.. ఎప్పటికైనా కుదురుతుందనే భావనతో ఏటా పరీక్ష రాస్తున్నట్లు నరేష్ తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



కూసుమంచిలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల

ఏన్కూరు/కూసుమంచి: రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఎరువులు, విత్తనాల ధరలు పెంచితే వ్యాపారులపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల హెచ్చరించారు. ఏన్కూరు మండల కేంద్రంతో పాటు కూసుమంచి మండలంలోని కూసుమంచి, నాయకన్‌గూడెం గ్రామాల్లో షాపులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా షాపుల్లో విత్తనాల లభ్యత, గోదాంల్లో ఎరువుల స్టాక్, రిజిస్టర్లను పరిశీలించాక డీఏఓ మాట్లాడారు. ఎరువులను పీఎవైఎస్ మిషన్ ద్వారా మాత్రమే విక్రయించాలని సూచించారు. ప్రతీ షాప్‌లో స్టాక్, ధరల పట్టికను ప్రదర్శించాలని తెలిపారు. అంతేకాక ప్రతీ విక్రయంపై రైతులకు పూర్తి వివరాలతో కూడిన బిల్లు ఇవ్వాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఏడీఏలు కరుణశ్రీ, విజయ్‌చంద్ర, ఏఓలు నర్సింహారావు, వాణి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ సుదర్శన్, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు

డీసీసీబీ భేటీలో మళ్లీ అదే తీరు

- అజెండాలోని అంశాలపై విభేదించిన మెజారిటీ డైరెక్టర్లు
- నూతన చైర్మన్ సహా ఇంకొన్ని చేర్చాలని డిమాండ్



సమావేశం నుంచి బయటకు వచ్చిన డైరెక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పాలకవర్గ సమావేశానికి రూపొందించిన అజెండాను మెజారిటీ డైరెక్టర్లు తిరస్కరించారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి చైర్మన్, డైరెక్టర్లు హాజరయ్యారు. చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన పాలకవర్గ సమావేశాన్ని ప్రారంభించగా.. సీఈఓ అబిద్ ఉర్ రెహమాన్ అజెండాను వెల్లడించేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే డైరెక్టర్లు కలగచేసుకుని గడిచిన రెండు సమావేశాల్లో తాము పేర్కొన్న అంశాలను అజెండాలో చేర్చనందున తిరస్కరిస్తున్నామని తెలిపారు. అంతేకాక తాము చెబుతున్న అంశాలను రిజిస్టర్‌లో రాసి అజెండాలో చేరిస్తేనే సమావేశంలో పాల్గొంటామని చెప్పి బయటకు వచ్చేశారు.

చైర్మన్ ఎన్నికకు పట్టు

పాలకవర్గ సమావేశం నుంచి బయటకు వచ్చిన పది మంది డైరెక్టర్లు మీడియాతో మాట్లాడారు. నూతన చైర్మన్ ఎన్నికతో పాటు మరో మూడు అంశాలను అజెండాలో చేర్చాకే సమావేశం నిర్వహించాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. గత చైర్మన్‌పై అనర్హత వేటు పడ్డాక వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావును తాత్కాలికంగా నియమించగా, మార్చి 15 నాటి పాలకవర్గ సమావేశంలో నూతన చైర్మన్ ఎన్నికపై తీర్మానం చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత ఇంకో రెండు సమావేశాల్లో ఇలాగే జరగగా, ఈ నెల 6వ తేదీ నాటి సమావేశాన్ని బహిష్కరించామని వివరించారు. చైర్మన్ సహా ఖాళీగా ఉన్న నాలుగు డైరెక్టర్ల ఎన్నిక, ఎన్నికల కోడ్ ఉన్న సమయాన జరిగిన ఉద్యోగుల బదిలీపై సమీక్ష, పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన వారికి చెల్లించిన రూ.78 లక్షల ఎరియర్స్‌పై చర్చించేలా అజెండాలో చేర్చాలని డైరెక్టర్లు జనగం కోటేశ్వరరావు, తుళ్లూరి బ్రహ్మయ్య, లక్కినేని సురేందర్ రావు, బొర్రా రాజశేఖర్, మేకల మల్లిబాబు యాదవ్, బోబోలు లక్ష్మణ్ రావు, నూకల సైదులు, అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, చావా వేణుగోపాలకృష్ణ, మోదుగు పుల్లారావు డిమాండ్ చేశారు. కాగా, డైరెక్టర్లు సమావేశం నుంచి బయటకువచ్చాక కార్యాలయ ఆవరణలోని గెస్ట్‌హౌస్‌కు తాళం వేసి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాళం తీయాలని సూచించినా సిబ్బంది తమ వద్ద తాళం లేదని చెప్పడంతో పగలగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే చైర్మన్ వెంకటేశ్వరరావు రాగానే తాళం తీయడంతో ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తుండగా కాసేపు వాగ్వాదం జరిగింది.

ఆగుదామా.. సాగుదామా?

- తొలకరిలో ఊపందుకోని వర్షాలు
- జిల్లాలో ఇంకా విస్తరించని రుతు పవనాలు
- విత్తనాలు నాటేందుకు రైతుల ఎదురు చూపు
- కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే విత్తిన వారిలో ఆందోళన
- పూర్తి స్థాయిలో వర్షం కురిస్తేనే సాగుకు అనుకూలం



విత్తనాలు నాటేందుకు కొణిజర్లలో దుక్కి దున్ని సిద్ధం చేసిన పొలం



పల్లిపాడులో పత్తి విత్తనాలు మొలకెత్తని భూమి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: నైరుతి రుతుపవనాల దోబూచులాటతో జిల్లా రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు పత్తి, ఇతర మెట్ట పంటలు వేసేందుకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకుని విత్తనాలు కొనుగోలు చేశారు. కొందరు రైతులు ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తగా పొడి వాతావరణం నెలకొనడంతో వర్షాలు ఎప్పుడు కురుస్తాయోనని ఎదురుచూస్తున్నారు. వారం రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో మిగిలిన వారు విత్తనాలు ఎప్పుడు నాటాలా అని హైరానా పడుతున్నారు. జిల్లాలో అన్ని పంటలు కలిపి 7,03,676 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేయగా.. ఇప్పటివరకు అన్నీ కలిపి 32,395 ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు.

కరుణించని వరుణుడు

జిల్లాలోకి ఈ నెల మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఇప్పటి వరకు సరైన వర్షం మాత్రం కురవలేదు. దీంతో పంటల సాగు నత్తనడకన సాగుతోంది. గత ఏడాది సైతం ఇదే పరిస్థితి నెలకొని సాగు విస్తీర్ణమే తగ్గింది. ఈ ఏడాది మే నెలలో కురిసిన అకాల వర్షాలతో కొందరు రైతులు దుక్కులు దున్నారు. పత్తి సాగుకు సిద్ధమైన రైతులు విత్తనాలు నాటినా ఈనెల ఇప్పటివరకు సరైన వర్షాలు లేక అయోమయంలో పడ్డారు.

భూమి పదును ఎక్కితేనే..

జిల్లాలో పత్తి ప్రధాన పంటగా సాగవుతోంది. అయితే, 60 మి.మీ. కనీస వర్షపాతం నమోదైతేనే విత్తనాలు విత్తేందుకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది. కానీ జిల్లాలో ఎక్కడా ఆ మేరకు వర్షం కురవలేదు. ఈ ఏడాది జిల్లాలో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2 లక్షల ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ఇప్పటి వరకు 24,313 ఎకరాల్లో మాత్రమే విత్తనాలు నాటగా.. పూర్తిస్థాయిలో వర్షం కురిస్తేనే మిగతా రైతులు నాటే అవకాశముంది. కాగా, ఈ పంట సాగు కోసం జూలై 20 వరకు అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మిగిలిన పంటలదీ అదే దారి..

పత్తి సహా మిగిలిన పంటల సాగూ ఊపందుకోలేదు. మెట్ట పైరుగా వేసే పెసర సాగు కూడా అంతంతమాత్రంగానే ఉంది. పెసర సాధారణ సాగు విస్తీర్ణం 15,357 ఎకరాలైతే 484 ఎకరాల్లోనే సాగైంది. ఈ పంట సాగుకు జూన్ నెలే అనుకూలంగా ఉంటుంది. జిల్లాలో మరో ప్రధాన పంట అయిన వరికి సంబంధించి బోర్లు, బావుల కింద నార్లు పోసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 743 ఎకరాలకు సరిపడా నారుమడి మాత్రమే పోసినట్లు అంచనా. రానున్న కాలంలో పుష్కలంగా వర్షాలు కురిసి జలాశయాల్లోకి నీరు చేరితేనే నార్లు పోయాలనే ఆలోచనలో రైతాంగం ఉన్నట్లు తెలుస్తోంది.


జిల్లాలో ఇప్పటి వరకు వేసిన పంటలు

పంట	విస్తీర్ణం అంచనా (ఎకరాల్లో)	సాగైంది (ఎకరాలు)
వరి	2,83,943	743 (నారు)
మొక్కజొన్న	3,374	42
పత్తి	2,01,834	24,313
పెసర	15,357	484
ఇతరాలు	1,06,119	6,813

వర్షం అంతంతే..

జిల్లాలో తొలకరి సీజన్‌లో వర్షపాతం నామమాత్రంగానే నమోదవుతోంది. గత ఏడాది మే నెలలో 6 సెం.మీ. వర్షానికి 8.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది ఇదే నెలలో 5.4 సెంటీమీటర్లకు గాను 8.2 సెంటీమీటర్లు కురిసింది. దీంతో రైతులు ముందుగానే సాగు పనులు చేపట్టారు. గత ఏడాది జూన్‌లో 12.4 సెం.మీ.కు 4.9 సెం.మీ. వర్షపాతమే నమోదు కావడంతో సాగు ఆలస్యమైంది. ఈసారి జూన్‌లో ఇప్పటి వరకు 4.2 సెంటీమీటర్లకు గాను 5.4 సెం.మీ. వర్షం కురిసినా ఇది పంటల సాగుకు సరిపోవడం లేదు.

విత్తనాలు మొలకెత్తలే...



ఈ రైతు నల్లపాటి నరసింహారావు. కొణిజర్ల మండలం లక్ష్మీపురానికి చెందని ఈయన నాలుగు ఎకరాల్లో పత్తి సాగుకు సిద్ధమయ్యాడు. మే నెలలో వర్షం పడడంతో దుక్కి దున్నాడు. మళ్లీ వర్షాలు పడతాయనే భావనతో పొడి దుక్కుల్లోనే విత్తనాలు పెట్టాడు. అయితే, ఆతర్వాత వర్షం లేక విత్తనాలు మొలకెత్తలేదు. ఎకరానికి రూ.12 వేల చొప్పున ఇప్పటికే రూ.48 వేలు వెచ్చించిన ఆయన వర్షం కోసం చూస్తున్నాడు.

వర్షాలపైనే ఆశ..



మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశా. ఇటీవల వర్షాలు కురవడంతో పత్తి విత్తనాలు విత్తా. ఆ తర్వాత వర్షాలు కురవకపోగా ఎండలు పెరిగాయి. దీంతో విత్తనాలు మొలకెత్తేది అనుమానంగానే కనిపిస్తోంది. ఇప్పుడు అటూఇటు కాని పరిస్థితి ఉంది. వర్షాలు కురిస్తే విత్తనాలు మొలకెత్తుతాయనే ఆశ ఉంది. అందుకోసం ఎదురుచూస్తున్నా.

– తురక రాంబాబు, ఎద్దులచెర్వు, తిరుమలాయపాలెం మండలం

క్లుప్తంగా

జాతీయ ఉషూ టోర్నీలో పతకం



పతకం, నగదు బహుమతి అందుకుంటున్న పవిత్రాచారి

ఖమ్మం స్పోర్ట్స్: కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట్‌లో ఇటీవల జరిగిన దక్షిణ భారత స్థాయి సీనియర్ ఉషూ టోర్నీలో ఖమ్మంకు చెందిన పి.పవిత్రాచారి బంగారు పతకం దక్కించుకుంది. నాన్‌దో ఈవెంట్‌లో ప్రతిభ చాటిన ఆమె మొదటిస్థానంలో నిలవడం విశేషం. ఈ సందర్భంగా క్రీడాకారిణిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి తదితరులు అభినందించారు.

జాబ్‌మేళాలో 31 మంది ఎంపిక

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన గురువారం ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహించారు. పేటీఎం, జియోలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన జాబ్‌మేళాకు 124 మంది అభ్యర్థులు హాజరుకాగా ఎంపికైన 31 మందికి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా అధికారి కొండపల్లి శ్రీరామ్, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖ ఆధ్వర్యాన ఖమ్మంలో నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల చైర్‌పర్సన్ నిష్తాశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూల్ విద్యార్థులకు బయాలజీ బోధించేందుకు బీజెడ్‌సీ, ఎమ్మెస్సీ బీఈడీ అర్హత ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల బోధనకు ఏదైనా డిగ్రీ, బీఈడీ పూర్తిచేసిన వారు, కంప్యూటర్ బోధించేందుకు ఏదైనా డిగ్రీలో కంప్యూటర్ సబ్జెక్టుగా కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈనెల 17లోగా పాఠశాలకు దరఖాస్తుకు పంపించడంతో పాటు వివరాల కోసం 94405 25093 నంబర్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.28.01లక్షలు

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవాదాయ శాఖ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఈఓ జి.సుదర్శన్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా 91 రోజులకు గాను రూ.28,01,520 నగదుతో పాటు విదేశీ కరెన్సీ, మిశ్రమ వెండి, బంగారం లభించాయి. ఈ కార్యక్రమంలో కరూర్‌వైశ్య బ్యాంక్ మేనేజర్ పి.మదన్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్ణశాల ఆదాయం రూ.17.19లక్షలు..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవస్థానం ఈఓ రమాదేవి పర్యవేక్షణలో సిబ్బంది లెక్కింపు చేపట్టగా 147 రోజులకు గాను రూ.17,19,292 ఆదాయం నమోదైంది. అలాగే, విదేశీ కరెన్సీ కూడా లభించినట్లు ఈఓ తెలిపారు. ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, ఉద్యోగులు నిరంజన్, కత్తి శ్రీనివాస్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గృహ రుణాలపై ఆంక్షలు ఎత్తివేత

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల గృహ రుణాలపై గతంలో ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉద్యోగ విరమణకు ఒక ఏడాది మాత్రమే గడువు ఉన్నా, ఉద్యోగంలో చేరి ఏడాది పూర్తి కాకున్నా గృహ రుణాలు ఇచ్చేవారు కాదు. దీంతో చాలా మంది కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాస్తవానికి యాజమాన్యమే కార్మికులకు ఇళ్లు నిర్మించాల్సి ఇవ్వాలి. తీసుకున్న రుణానికి వడ్డీ సంస్థ నుంచే చెల్లించాలి. కానీ అలా చేయకపోవడంతో కార్మికులే సొంతంగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. అయితే 8.33 శాతం మేర వడ్డీకి తీసుకున్న వారికి 6 లేదా 7 శాతమే యాజమాన్యం చెల్లించేది. ఈ సమస్యలన్నింటినీ సింగరేణి డైరెక్టర్(పా), ఫైనాన్స్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన యాజమాన్యం ఆంక్షలన్నీ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుందని గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,150	2,150
పెసలు	7,725	6,000
కందులు	10,750	8,800
మిర్చి	18,500	10,000
మిర్చి తాలు	9,000	5,600
ఏసీ మిర్చి	20,100	10,500
పత్తి	7,000	6,000

– ఖమ్మం వ్యవసాయం

మామిడి కొనుగోళ్లు అంతంతే..

- మహిళా సంఘాల ద్వారా తగ్గిన వ్యాపారం
- బాసటగా నిలవలేకపోతున్న అధికారులు
- ఈ ఏడాది మిర్చి జోలికే వెళ్లని వైనం
- మామిడి కొనుగోళ్లు 39.4 టన్నులే...



ఖమ్మంలోని ఔట్‌లెట్‌లో మామిడి కాయలు (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: ట్రేడర్లకు తీసిపోని విధంగా జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు వ్యాపారాల్లో రాణిస్తున్నారు. సభ్యులు ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ కంపెనీ(ఎఫ్‌పీసీ)లను ఏర్పాటు చేసుకుని అధికారుల సహకారంతో కొన్నేళ్లుగా రైతుల పండించిన పంటలను విక్రయిస్తూ ముందుకు సాగుతున్నారు. జిల్లాలో మిర్చి, మామిడి పంటలతో పాటు అపరాలను కొనుగోలు చేసి ప్రైవేట్ వ్యాపారులకు దీటుగా నిలబడ్డారు. దీంతో జిల్లాను ఆదర్శంగా తీసుకుని ఇతర జిల్లాల్లోనూ మహిళా సంఘాల ద్వారా పంటలు కొనుగోలు చేయించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, మిర్చి, మామిడి వ్యాపారాల్లో మహిళలు అవార్డులు అందుకోగా.. ఇటీవల మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహించడంలో అధికారులు పట్టింపులేని తనం కనబరుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. గతేడాది 100 టన్నులకు పైగా మామిడి కాయలను రైతుల నుండి ఎఫ్‌పీసీలు కొనుగోలు చేయగా.. ఈ ఏడాది కేవలం 39.4 టన్నులకు పరిమితం కావడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఎఫ్‌పీసీలుగా ఏర్పడి..

ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే రుణాలతో మహిళా సభ్యుల్లో అనేక మంది సొంతంగా వ్యాపారాలు చేస్తున్నారు. ఇందకొందరు ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ కంపెనీ(ఎఫ్‌పీసీ)లుగా ఏర్పడి రైతుల నుంచి ఉత్పత్తులను కొనుకోలు చేయడం ప్రారంభించారు. వీరు అధికారుల సహకారంతో కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని రైతుల నుండి సేకరించిన ఉత్పత్తులను వారికి అందించేవారు. తద్వారా వచ్చే నగదుతో రైతులకు చెల్లించగా మిగిలిన నగదు లాభంగా నమోదయ్యేది.

అధికారుల ప్రోత్సాహమేది?

ఏటేటా మహిళా సంఘాల సభ్యులు పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, ఇతర వ్యాపారాల్లో రాణించేలా అధికారులు ప్రోత్సహించాల్సి ఉంటుంది. ఇలా జిల్లాలోని మహిళలు అనేక రంగాల్లో రాణిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. అయితే, ఇటీవల ప్రోత్సాహం తగ్గుతుందనే విమర్శలున్నాయి. ఈ ఏడాది మిర్చి వ్యాపారం అసలే జరగకపోగా.. మామిడి వ్యాపారాన్ని నామమాత్రంగా పర్యవేక్షించారని చెబుతున్నారు. ఏటా కంపెనీలకు భారీగా తరలించడంతో పాటు జిల్లాలోని ఔట్‌లెట్లలో 10 టన్నుల నుండి 15 టన్నుల మేర విక్రయించేవారు. ఈ ఏడాది ప్రైవేట్ వ్యాపారులు మామిడికాయలు కేజీ రూ.100 వరకు అమ్ముతున్నా.. మహిళా సభ్యులు ఔట్‌లెట్లలో రూ.60కే విక్రయించారు. కానీ టీటీడీసీ భవనం సమీపాన ఏర్పాటు చేసిన ఔట్‌లెట్ అధికారులు ప్రచారం చేయలేదు. గతంలో డీఆర్‌డీఏ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయడంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో పాటు వివిధ పనులపై వచ్చే వారు కొనుగోలు చేసేవారు.

అంతంత మాత్రంగానే..

ఈ ఏడాది జిల్లాలో ఎఫ్‌పీసీలు రైతుల పంటల ఉత్పత్తుల కొనుగోలు అంతంత మాత్రంగానే సాగింది. జిల్లాలో అధికంగా సాగయ్యేమిర్చిని ఈ ఏడాది క్వింటా కూడా కొనుగోలు చేయలేదు. గతేడాది ఎనిమిది మండలాల్లో 1,440 మంది రైతుల నుండి 1,617.4 మెట్రిక్ టన్నుల మిర్చి కొనుగోలు చేయగా, ఈ ఏడాది ఆ ఊసే లేకపోవడం మహిళా సంఘాల సభ్యులను నిరాశ పరిచింది. ఇక మామిడి కాయలను కొనుగోలు చేసేందుకు బెంగళూరు, అహ్మదాబాద్‌ల్లో కొనసాగుతున్న వీగ్రో కంపెనీ, హైదరాబాద్‌లోని క్రొవెల్ అండ్ బెనిషన్ కంపెనీతో జిల్లాకు చెందిన గుమ్మల మంగమ్మ, సిరివెన్నెల ఎఫ్‌పీసీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రైతుల నుండి కొనుగోలు చేసిన 39.4 టన్నుల మామిడి కాయలు కొనుగోలు చేసి తరలించడమే కాక కొంత మేర సిరివెన్నెల ఎఫ్‌పీసీ ఔట్‌లెట్ ద్వారా జిల్లా కేంద్రంలోనేవిక్రయించారు. దీంతో రూ.14.45 లక్షల మేర లావాదేవీలే జరిగాయి. గతేడాది 100 టన్నులకు పైగా మామిడి కాయలను పైగా కొనుగోలు చేయగా, ఈసారివ్యాపారం అంతంత మాత్రంగానే సాగింది.

దిగుబడి తగ్గింది..

ఈ ఏడాది జిల్లాలో మామిడి దిగుబడి తగ్గింది. దీంతో రైతుల నుండి పెద్ద మొత్తంలో మామిడి కాయలు కొనుగోలు చేయలేకపోయాం. అంతేకాక మహిళల ద్వారా ఏర్పాటు చేసిన ఔట్‌లెట్ 15 రోజులు మాత్రమే నడిచింది.

– శ్రీనివాస్, డీపీఎం

మరొకరి ప్రాణం నిలబెట్టండి

- రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలి
- అపోహలు వీడి ముందుకురావాలని వైద్యుల సూచన
- బాధితులకు అండగా పలు బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్లు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



రక్తదానం చేస్తున్న దాతలు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడవచ్చు. కానీ అపోహలతో కొందరు రక్తదానానికి ముందుకు రావడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. వీటిని తొలగించేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నారు. రక్తదానంపై అవగాహన పెంపొందిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఎనిమిది ప్రధాన ప్రజాఆరోగ్య కార్యక్రమాల్లో రక్తదాతల దినోత్సవం ఒకటిగా గుర్తించారు.

మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చు..

సాధారణంగా రోడ్డు ప్రమాదాలు, తలసేమియా, కేన్సర్, ప్రసవం, శస్త్రచికిత్సల సమయంలో రక్తం చాలా అవసరం. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో తలసేమియా బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఆపదవేళ రక్త లభ్యత సవాలుగా మారుతోంది. 18 నుంచి 65 ఏళ్ల వయసున్న ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయవచ్చని, మూడు నెలలకోసారి రక్తం ఇవ్వడం మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. ఒక వ్యక్తి జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చని, రక్తదానం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సూచిస్తున్నారు. 15 రోజులకోసారి ప్లేట్‌లెట్లు ఇవ్వొచ్చని, రక్తదాతలు ఎర్రరక్తకణాలతో రక్తహీనత రోగిని, ప్లాస్మాతో ఒకరిని, ప్లేట్‌లెట్లతో మరొకరిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని వివరిస్తున్నారు. రక్తదానం చేసినప్పుడు ఏర్పడిన నష్టం 4 నుంచి 8 రోజుల్లో భర్తీ అవుతుందని పేర్కొంటున్నారు.

సామాజిక మాధ్యమాల ద్వారా..

కొందరు సామాజిక బాధ్యతగా రక్తదానం చేస్తూ పలువురితో చేయిస్తూ ముందుకు సాగుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా బ్లడ్ డోనేషన్ ఆర్గనైజేషన్లను నడుపుతున్నారు. భద్రాచలం పట్టణంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారు రక్తం అవసరమైతే ఆర్గనైజర్లను సంప్రదిస్తుండగా, వారు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. దీంతో పలువురు యువకులు ముందుకొచ్చి రక్తదానం చేస్తున్నారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్, ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ వద్ద కూడా దాతల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుతున్నారు.

అరుదైన గ్రూపులు..

అరుదైన బ్లడ్ గ్రూపులైన ఓ నెగిటివ్, బీ నెగిటివ్, ఏబీ పాజిటివ్ రక్తం కలిగినవారిని గుర్తించి ఆర్గనైజర్లు ఆయా గ్రూపుల్లో చేర్చారు. వారికి అవగాహన పెంపొందిస్తూ రక్తదానం చేసేలా కృషి చేస్తున్నారు. పట్టణానికి చెందిన మహమ్మద్ జిందా 2000 సంవత్సరం నుంచి జిందా బ్లడ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్నాడు. 'ఓ' నెగెటి వ్ గ్రూపు కలిగిన తాను ఇప్పటివరకు 65 సార్లు రక్తదానం చేశానని, మరో 3 వేల మందితో రక్తదానం చేయించానని చెబుతున్నాడు. ఇలాగా మరో ఐదారు గ్రూపులు రక్తదానం చేయిస్తున్నాయి.

రహదారిపై ధర్నా చేసిన 13 మందిపై కేసు

కొణిజర్ల: కొణిజర్లలో బుధవారం సాయంత్రం రహదారిపై రాస్తారోకో చేసి వాహనదారులకు ఇబ్బంది కలిగించారంటూ 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జె.శంకరరావు తెలిపారు. కొణిజర్లలోని ఆయుర్వేద వైద్యశాలలో విద్యుత్ షాక్‌తో వైరా మండలం గొల్లపూడికి చెందిన ఎలక్ట్రీషియన్ నారగాని సతీష్ మృతి చెందాడు. ఆయన కుటుంబానికి వైద్యాధికారులు న్యాయం చేయాలంటూ పీహెచ్‌సీ ఎదుట బంధువులు ధర్నా చేశారు. అనంతరం వైద్యాధికారులు రాలేదనే ఆగ్రహంతో మృతదేహాన్ని వైరా – ఖమ్మం రాష్ట్రీయ రహదారిపై ఉంచి రాస్తారోకో చేయగా, వైరా సీఐ సాగర్‌నాయక్, ఎస్‌ఐ శంకరరావు నచ్చచెప్పినా వినలేదు. ఈ నేపథ్యాన గురువారం 13 మందిపై కేసు నమోదు చేయగా, వీడియోల ఆధారంగా మిగతా వారిని గుర్తిస్తున్నట్లు ఎస్‌ఐ శంకరరావు తెలిపారు.

భార్య గొంతు కోసిన భర్త..



బాధితురాలు ప్రమీల

సత్తుపల్లిటౌన్: భార్యతో గొడవపడిన భర్త క్షణికావేశంలో ఆమె గొంతు కోసి పరారయ్యాడు. సత్తుపల్లిలోని వెంకటేశ్వర టాకీస్ రోడ్డులో ఆర్.సురేష్ – ప్రమీల దంపతులు నివాసముంటున్నారు. వీరిలో సురేష్ ఎలక్ట్రీషియన్‌గా, ప్రమీల ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయాగా పనిచేస్తోంది. కొంతకాలంగా కుటుంబ కలహాలు నెలకొనడంతో గురువారం మధ్యాహ్నం కూడా ఇంట్లో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సురేష్ చాకుతో భార్య గొంతు కోసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పోలీసులు విచారణ చేపట్టారు.

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: దాడికి పాల్పడిన ఓ వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను కథనం ప్రకారం.. దొంతికుంటకు చెందిన బేతి నాగేంద్రరావు, ఎం.చిలకయ్య కాలినడకన వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి సైకిల్‌పై వచ్చిన అశ్వారావుపేటకు చెందిన పుట్టి అభిరామ్ అనే వ్యక్తి పాతకక్షల నేపథ్యంలో రాయితో దాడికి పాల్పడ్డాడు. దీంతో నాగేంద్రరావు కంటి భాగంలో గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీఎం ఢీకొట్టడంతో 12 గేదెలు మృతి

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెం వద్ద వాహనం ఢీకొట్టిన ఘటనలో 12 గేదెలు మృతి చెందాయి. పోలీసులు కథనం ప్రకారం... మండలంలోని తెట్టేలపాడు గ్రామానికి చెందిన పలువురు రైతుల గేదెలు రెండు రోజుల క్రితం అడవిలో మేతకు వెళ్లాయి. వేసవి కావడంతో అడవుల్లోనే ఉన్న గేదెలు గురువారం బయటకు వచ్చి రోడ్డు దాటుతుండుగా ఖమ్మం నుంచి మరిపెడ బంగ్లా వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో 12 గేదెలు మృతి చెందడంతో బాధిత రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



సిరిపురంలో మృతి చెందిన గేదెలు

పిడుగుపాటుతో రెండు...

మధిరరూరల్: మధిర మండలం సిరిపురం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపాన గురువారం పిడుగు పడడంతో రెండు పాడిగేదెలు మృతి చెందాడు. గ్రామంలోని నంబూరి శ్రీనివాసరావు, నారాయణకు చెందిన రెండు గేదెలు పొలంలో మేతకు వెళ్లాయి గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. ఇదేసమయాన సబ్ స్టేషన్ వద్ద మేస్తున్న రెండు పాడి గేదెల వద్ద పిడుగు పడడంతో మృతి చెందాయి. సుమారు రూ.2లక్షల విలువైన గేదెలను కోల్పోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



హన్మంతరావు (ఫైల్)

ముదిగొండ: వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిన ఓ రైతు మృతి చెందాడు. ముదిగొండ మండలం చిరుమర్రికి చెందిన రైతు గాలి హన్మంతరావు(37) గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ వ్యవసాయ బావి వద్ద ఉండగా.. ఆయనకు మూర్ఛ రావడంతో ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. ఈమేరకు గుర్తించిన స్థానికులు హన్మంతరావు మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే, ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇల్లెందు మండలంలో...

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ కట్టుగూడెనికి చెందిన ఓ వ్యక్తి గురువారం బావిలో పడి మృతి చెందాడు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన నున్న శ్రీనివాస్ (56) గేదెలు రెండు రోజులుగా కనిపించడంలేదు. దీంతో గ్రామ శివారులో వెతుకుతుండగా ఓ పాడుబడ్డ బావిలో గేదె మృతి చెంది కనిపించింది. మృతి చెందిన గేదె తనదో.. కాదోనని తొంగి చూస్తుండగా కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

చింతకాని: మండలంలోని నాగులవంచ ఎన్నెస్పీ కాల్వ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతర్లపాడుకు చెందిన ఉప్పల నరేందర్(23) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల నరేందర్, ఆయన సోదరుడు లోకేష్ ప్రతిరోజు ఖమ్మంకు ద్విచక్ర వాహనంపై కూలీ పనులకు వెళ్లి వస్తుంటారు. ఈక్రమంలో ఖమ్మం నుంచి బుధవారం రాత్రి వస్తుండగా నాగులవంచ ఎన్నెస్పీ కాల్వ సమీపాన రహదారిపై ఉన్న గేదెలను తప్పించబోయి కిందపడ్డారు. ఈ ఘటనలో నరేందర్ తలకు తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అలాగే, కాలికి తీవ్ర గాయమైన లోకేష్‌ను ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

తెలుగు పుస్తకాలు వెనక్కి..



ఎనిమిదో తరగతి తెలుగు వాచకం

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి/పాల్వంచ రూరల్/రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నారు. ఇందులో 1నుంచి 10వ తరగతి వరకు తెలుగు పుస్తకాల మొదటి పేజీ(ముందు మాట)లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అని విద్యాశాఖ మంత్రులు కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డి అంటూ పాత పేర్లే ముద్రితమయ్యాయి. ఈ అంశాన్ని బుధవారమే గుర్తించినా ఆ పేజీ తొలగించి సరఫరా చేయాలని తొలుత సూచించారు. అయితే, గురువారం ఆయా పుస్తకాలను వెనక్కి తీసుకోవడంతో పాటు మిగతా వాటి పంపిణీని నిలిపేయాలని ఆదేశాలు రావడంతో ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ ఎంఈఓలకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయా పుస్తకాలను మండల రిసోర్స్ సెంటర్(ఎంఆర్‌సీ)లో భద్రపరుస్తున్నారు. జిల్లాలో 80వేలకు పైచిలుకు తెలుగు పాఠ్యపుస్తకాలకు గాను 26వేల పుస్తకాలను తొలిరోజు పంపిణీ చేయగా వాటిని వెనక్కి తీసుకుంటున్నారు. తెలుగు మినహా మిగతా పుస్తకాలను యథావిధిగానే పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, పాల్వంచ, నేలకొండపల్లి, రఘునాథపాలెం మండలాల్లో 1నుంచి 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన, పంపిణీ చేయకుండా పాఠశాలల్లో మిగిలిన తెలుగు వాచకం పుస్తకాలను వెనక్కి తీసుకుంటున్నట్లుట్లు ఎంఈఓలు శ్రీరామ్మూర్తి, బి.రాములు, ఎం.శ్రీనివాస్ వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు.

మత్స్య ఉత్పత్తిలో అగ్రగామిగా నిలపాలి



మాట్లాడుతున్న రూపేందర్‌సింగ్

కూసుమంచి: తెలంగాణ రాష్ట్రాన్ని మత్స్య ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిపేలా మత్స్యకారులు కృషి చేయాలని సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి టి.రూపేందర్ సింగ్ సూచించారు. కూసుమంచి మండలం పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల మత్స్య రైతులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా రూపేందర్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మత్స్యకారులకు పాలేరులో అందిస్తున్న శిక్షణ వారిలో నైపుణ్యాలు పెరగడానికి దోహదం చేస్తుందని తెలిపారు. అనంతరం పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, శాస్త్రవేత్త రవీందర్ వివిధ అంశాలపై మాట్లాడారు.

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు తేలడంతో నిందితుడికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.55 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి కె.ఉమాదేవి తీర్పు చెప్పారు. గురువారం వెలువడిన ఈ తీర్పు వివరాలు... రఘునాథపాలెం మండలం చిమ్మపూడి ఎస్సీ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ కంపాటి కార్తీక్ అదే గ్రామంలో ఉంటున్న ఆరేళ్ల చిన్నారిని 2023 మార్చి 5న ఆటోలో ఇంటి నుండి ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఘటనపై బాధితురాలి తల్లి ఫిర్యాదుతో రఘునాథపాలెం పోలీసులు అదే ఏడాది మార్చి 6న పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేయగా, నేరం రుజువు కావడంతో కార్తీక్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కాగా, పకడ్బందీ సాక్ష్యాలు సేకరించి నిందితుడికి శిక్ష పడటంలో కీలకపాత్ర పోషించిన దర్యాప్తు అధికారి ఏసీపీ బస్వారెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.శంకర్, భరోసా లీగల్ అధికారి ఎం.ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ జి.రవికిషోర్, హెడ్ కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసరావు, మోహన్‌రావు, హోంగార్డు అయూబ్‌లను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

భారీగా బూబీట్రాప్స్ వెలికితీత

58 బూబీట్రాప్స్ నుంచి 3,350 ఇనుప చువ్వలను తీసిన బలగాలు



బూబీట్రాప్స్‌ను తొలగిస్తున్న పోలీసులు

చర్ల: మండలంలోని పూసుగుప్పలో పోలీసులు గురువారం భారీ సంఖ్యలో బూబీట్రాప్స్‌ను వెలికితీశారు. పూసుగుప్ప శివారు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటుచేసిన 58 బూబీట్రాప్స్‌ను గుర్తించిన చర్ల పోలీసులు, పూసుగుప్ప సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ సిబ్బంది వాటిని తొలగించారు. ఈనెల 10వ తేదీన ఇదే ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన 70 బూబీట్రాప్స్ నుంచి 4,396 పదునైన ఇనుప చువ్వలను వెలికి తీయగా, గురువారం 58 బూబీట్రాప్స్ నుంచి 3,350 ఇనుప చువ్వలను వెలికి తీశారు. ఈ క్రమంలో సరిహద్దు అటవీ ప్రాంతాల్లో ఇలాంటివి మరిన్ని ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై సమీప ఆదివాసీ గ్రామాల గిరిజనులు పోలీసులకు ఫిర్యాదు చేస్తుండడంతో ఎస్పీ రోహిత్‌రాజ్, సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాగా, సరిహద్దు ప్రాంతాల ఆదివాసీలు, గిరిజనులు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాదికారులు కోరారు.

ప్రారంభించకముందే బుంగలు





ప్రాజెక్టు కాల్వకు పడిన బుంగ, (ఇన్‌సెట్) ప్రాజెక్టు కాల్వలో మొలిచిన మొక్కలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పనులు ఇంకా కొనసాగుతున్నాయి. అయితే, ప్రాజెక్టు ప్రారంభానికి ముందే పలు ప్రాంతాల్లో కాల్వలు దెబ్బతింటున్నాయి. ఈ ప్రాజెక్టు కాల్వకు ములకలపల్లి మండలం వీ.కే.రామవరం(పూసుగూడెం) వద్ద బుంగలు పడ్డాయి. అంతేకాక కొన్నిచోట్ల చెట్లు మొలిచాయి. ఇక్కడ పడిన బుంగ పెద్దగా ఉండడంతో వెంటనే మరమ్మత్తులు చేయించాల్సిన అవసరం ఉంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్